నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, గురువారం 16 జనవరి 2025 | NIZAMABAD




## ఉనికి లేని కామారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ

నుడా తరహాలోనే కామారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా)ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. కుడా కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లో కూడా విస్తరించగా, ఇప్పటివరకూ పాలకవర్గం పత్తాలేకుండా పోయింది. ఉత్తర్వులు జారీ చేసినా సిబ్బంది నియామకం, పాలకవర్గం ఏర్పాటు ప్రతిపాదనలు ఇంకా రూపొందించలేదు. కామారెడ్డిలోనూ అధికార పార్టీలో 'కుడా' ఏర్పాటు రాజకీయం అగ్గి రాజేస్తున్నది. కామారెడ్డి మినహా మిగిలిన మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఉండడంతో డైరెక్టర్ల నియామకంలో ఎవరి పేర్లు ప్రతిపాదనకు వస్తాయో? అనే చర్చ జోరుగా సాగుతున్నది. రాజధాని హైదరాబాద్‌కు కామారెడ్డి పట్టణం వంద కిలో మీటర్ల దూరంలోనే ఉంది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని 'కుడా' ప్రభావవంతంగా మారే అవకాశాలు ఉండడంతో చాలా మంది నేతలు పదవులపైనే ఫోకస్ పెట్టారు. ఇందులో చోటు కల్పించడం కాంగ్రెస్ నేతలకు కత్తిమీది సాములా మారడంతో ఒక అడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కి అన్నట్లుగా పరిస్థితి మారింది.

## కాగితాలకే పరిమితమైన పరిధి పెంపు

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన నుడా పరిధిలోకి 13 మండలాలు, 83 గ్రామాలను తీసుకువచ్చింది. డైరెక్టర్లుగా 13 మందికి అవకాశం కల్పించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం నుడా పరిధిని జిల్లాలోని అన్ని మండలాలకు దాదాపుగా విస్తరించింది. జిల్లాలోని 33 మండలాల పరిధిలోని 383 గ్రామాలను నుడా పరిధిలోకి చేర్చింది. ఈ గ్రామాల పరిధిలో అభివృద్ధి పనులతో పాటు నిర్మాణాలు, మౌలిక వసతులను కల్పించనున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్మాణాలను చేపట్టనున్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం నుడా పరిధిని పెంచిందని, కాంగ్రెస్ నేతలు చెప్పుకుంటున్నప్పటికీ, పరిధి పెంపు నిర్ణయం వివాదాస్పదంగా మారింది. ఎమ్మెల్యేల అధికారాలకు కత్తెర వేసేందుకు 'నుడా' పరోక్షంగా అధికార కేంద్రంగా మారబోతుందన్న వాదన బలంగా వినిపిస్తున్నది. నుడా పరిధిని పెంచినా పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించకపోవడం విమర్శలకు తావిస్తున్నది. నుడా చైర్మన్‌గా కేశ వేణును నియమించింది. 33 మండలాల్లోని గ్రామాలను నుడా పరిధిలోకి తీసుకువచ్చింది. దీంతో డైరెక్టర్ల సంఖ్యను పెంచాల్సిన ఆవశ్యకత ఏర్పడడంతో కీలక నేతల అధికార దర్పం ఎక్కడ చేజారుతుందో అనే భయాందోళన వారిని వెంటాడుతున్నది.




# కాంగ్రెస్‌లో నుడా లొల్లి

## పదవుల కోసం పాకులాట!

- కేవలం చైర్మన్‌ను నియమించిన ప్రభుత్వం
- నుడా పరిధి పెంపుతో పెరగనున్న పదవుల సంఖ్య!
- డైరెక్టర్ పోస్టుల కోసం ఆశావహుల యత్నం
- కీలక నేతల ప్రసన్నం కోసం రాజధానికి క్యూ
- భర్తీ ప్రక్రియకు అడ్డు పడుతున్న ఎమ్మెల్యేలు?
- ఉత్తర్వులకే పరిమితమైన 'కామారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ'

నిజామాబాద్, జనవరి 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నామినేటెడ్ పోస్టుల కోసం అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు మొదలయ్యాయి. మొన్నటివరకు రాష్ట్రస్థాయిలో వివిధ కార్పొరేషన్ల పదవులను ఆశించి భంగపడిన వారందరూ.. ఇప్పుడు నుడా (నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) పదవుల కోసం పాకులాడుతున్నారు. పార్టీలో పాత తరం నేతలు, కొత్తగా వివిధ పార్టీల నుంచి వచ్చిన నాయకుల మధ్య సయోధ్య లేకపోవడంతో విభేదాలు బహిర్గ మ వు తున్నాయి. ప్రభుత్వం నుడా చైర్మన్‌ను నియమించి నెలలు గడుస్తున్నా..ఇప్పటివరకు డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయలేదు. నుడా డైరెక్టర్ పదవుల కోసం చాలా మంది ఆశావహులు హైదరాబాద్‌కు క్యూ కడుతున్నారు. జిల్లాకు చెందిన పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌తోపాటు మంత్రులు, ఇతర ముఖ్యనేతలను ప్రసన్నం చేసుకుంటున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నుడాలో 13 మంది డైరెక్టర్ల నియామకానికి అవకాశం ఉండేది. కాంగ్రెస్ ప్రభుత్వం నుడా పరిధిని జిల్లా అంతటికీ విస్తరించడంతో డైరెక్టర్ల పోస్టుల సంఖ్య పెరిగే అవకాశం ఏర్పడింది. దీంతో ఆశావహుల సంఖ్య కూడా పెరిగింది. డైరెక్టర్ల కోసం పట్టుబడుతున్న వారిని సముదాయించే క్రమంలో కాంగ్రెస్‌లో పదవులు లొల్లి కొత్తగా తలనొప్పులను తెచ్చి పెడుతున్నది.

### కీలక నేతల గెలుపే

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి విముఖత చూపుతున్నవారు నామినేటెడ్ పోస్టులపై కన్నేశారు. కానీ వీరికి నేతల సహకారం దక్కకపోవడంతో రగిలిపోతున్నారు. ఇటీవల పార్టీ అంతర్గత సమావేశంలోనూ ఓ కీలక నాయకుడిని కొంతమంది జిల్లాకు చెందిన నేతలు నిలదీసినట్లు ప్రచారం జరుగుతున్నది. 'మీరే పదవులు అనుభవిస్తారా...? మాకు పదవులు వద్దా...?' అంటూ ప్రశ్నించినట్లు సమాచారం. ఈ పరిణామాలతో నేతల మధ్య దూరం మరింత పెరిగినట్లుగా తెలుస్తోంది. పీసీసీ చీఫ్‌కు నుడా డైరెక్టర్ల భర్తీపై పలువురు విన్నపాలు అందించినట్లు సమాచారం. నియోజకవర్గ ఇన్‌చార్జీలు, ఎమ్మెల్యేలతోనే తన వద్దకు రావాలని ఆయన సూచించడంతో కింది స్థాయి నాయకత్వం కినుక వహించినట్లు తెలిసింది.

### భర్తీ ప్రక్రియకు ఎమ్మెల్యేల అడ్డుకట్ట!

నుడా డైరెక్టర్ల నియామకం ఎప్పుడో జరగాల్సి ఉండగా జిల్లాకు చెందిన కాంగ్రెస్ కీలక నేతలే అడ్డుకుంటున్నట్లుగా తెలిసింది. తమ చెప్పుచేతల్లో ఉంటున్న వారికి పదవులు కట్టబెడితే, తర్వాత తమ మాట వినడం కష్టమేనన్న ఉద్దేశంతో భర్తీ ప్రక్రియను ముందుకు వెళ్లనీయడంలేదని సమాచారం. ఎమ్మెల్యే చొరవ తీసుకుంటే పదవుల భర్తీ ప్రక్రియ త్వరగా పూర్తయ్యే అవకాశం ఉన్నా, పట్టించుకోకపోవడంపై పార్టీలోని ద్వితీయశ్రేణి నాయకులు మండిపడుతున్నారు.నుడాకు వెంచర్ల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై దృష్టిసారించాలి. ఏవైనా అక్రమాలు చోటుచేసుకుంటే చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. అయితే కొన్ని వెంచర్ల ఏర్పాటులో సొంతపార్టీ నేతలే క్రియాశీలకంగా మారితే, తమకు ఇబ్బందులు తప్పవనే సాకుతో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిన నాయకులు వారిని తొక్కి పెడుతున్నట్లు ప్రచారం జరుగుతునన్నది.

## రేవంత్ వరెస్ట్ పాలనలో
# అరెస్టుల పర్వం

- హామీల అమలుపై ప్రశ్నిస్తే అక్రమ నిర్బంధాలు
- అక్కడ మోడీది ఈడీ పాలన.. ఇక్కడ రేవంత్‌ది ఏసీబీ, జేసీబీ పాలన
- అరెస్టయిన బీఆర్‌ఎస్ నేతలను తక్షణమే విడుదల చేయాలి
- లేదంటే జిల్లావ్యాప్తంగా ఆందోళన : జీవన్‌రెడ్డి వార్నింగ్



నందిపేట్, జనవరి 15: సీఎం రేవంత్‌రెడ్డి వరెస్ట్ పాలనలో ప్రజా సమస్యలపై ప్రశ్నించే వారిపై అరెస్టుల పర్వం కొనసాగుతున్నదని బీఆర్‌ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆరోపించారు. హోంమంత్రిత్వ శాఖను కూడా నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఇచ్చిన ఎన్నికల హామీల అమలుపై ప్రశ్నిస్తే అక్రమ నిర్బంధాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలీస్‌స్టేషన్లా ? కాంగ్రెస్ కార్యాలయాలా ? లేక కాంగ్రెస్, బీజేపీల భజన మందిరాలా ? అని నిలదీశారు. అక్కడ మోడీది ఈడీ పాలన, ఇక్కడ రేవంత్‌ది ఏసీబీ, జేసీబీ పాలన అని, కాంగ్రెస్, బీజేపీలు ప్రజాకంటకం, ప్రాణసంకటంగా మారాయని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్, బీజేపీలు విషం కక్కుతున్నాయని, ఇదే నా మోడీ సుపరిపాలన ? ఇదేనా రేవంత్‌రెడ్డి ప్రజాపాలన ? అని ధ్వజమెత్తారు. ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో ప్రధానమైనవి తొమ్మిది అని.. ఏడాది గడిచినా ఒక్కటి కూడా అమలు చేయలేదని నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నదన్నారు. రాకేశ్‌రెడ్డి నిర్వాకంపై రచ్చబండ దగ్గర, చాయ్ దుకాణాల వద్ద ప్రజలు చర్చించుకుంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తు లు ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి హామీల అమలును ప్రశ్నిస్తూ ఆయన నియోజకవర్గానికి రావొద్దని పోస్టర్లు అతికించారన్నారు. ఈ పోస్టర్లతో ఎలాంటి సంబంధం లేకపోయినా నందిపేట పోలీసులు బీఆర్‌ఎస్ నాయకులైన రాము, విజయ్‌తోపాటు జిల్లావ్యాప్తంగా పలువురిని అరెస్టు చేశారని, ఈ విషయాన్ని ఇన్‌చార్జి పోలీసు కమిషనర్ సింధూశర్మ దృష్టికి తెచ్చి నిరసన వ్యక్తం చేశామన్నారు. డీసీపీ బస్వారెడ్డి కాంగ్రెస్ పార్టీ, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కనుసన్నల్లో పని చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు కొమ్ముకాస్తున్న పోలీసుల పేర్లు పింక్‌బుక్‌లో ఎక్కిస్తున్నామని, వచ్చేది వందశాతం కేసీఆర్ ప్రభుత్వమే అని, అందరి లెక్కలు వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు. పోలీసుల తీరు మారకుంటే 60 లక్షల గులాబీ సైన్యం తిరగబడుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ కలుపు మొక్కలను పీకిపారేస్తామని, ఆయా పార్టీల నాయకుల బలుపు తగ్గిస్తామని ఆయన హెచ్చరించారు. అరెస్టు చేసిన బీఆర్‌ఎస్ నేతలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని జీవన్‌రెడ్డి వార్నింగ్ ఇచ్చారు.

## 'ఆర్మూర్ నియోజకవర్గానికి రావొద్దు'..

- ఇచ్చిన హామీలు ఏమయ్యాయి..?
- ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిని ప్రశ్నిస్తూ నందిపేట్‌లో వెలిసిన పోస్టర్లు



నందిపేట్‌లోని ఓ ప్రధాన కూడలి వద్ద వెలిసిన పోస్టర్

నందిపేట్, జనవరి 15: ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఆర్మూర్ నియోజకవర్గానికి రావొద్దంటూ నందిపేట్‌లో బుధవారం పోస్టర్లు వెలిశాయి. నందిపేట్‌లోని వైన్స్ దుకాణం, బస్టాండ్‌తోపాటు పలు ప్రధాన కూడళ్ల వద్ద పోస్టర్లు దర్శనమిచ్చాయి. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తూ ఈ పోస్టర్లను ముద్రించారు. రూపాయికి వైద్యం, సొంత ఖర్చుతో ఇండ్ల నిర్మాణం, యువతకు ఉపాధి మార్గాలు తదితర విషయాలతో కూడిన పోస్టర్లను గోడలకు అతికించారు. ఇదే విషయం ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ కాగా.. ప్రస్తుతం పోస్టర్లు వెలిశాయి. ఎమ్మెల్యే ఫొటోతో కూడిన పోస్టర్లు గోడలపై కనిపించడం మండలంలో చర్చనీయాంశం అయ్యింది. ఈ విషయమై బీజేపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# కేసులకు భయపడేది లేదు!

## బాల్కొండ పోలీస్‌స్టేషన్ ఎదుట బీఆర్‌ఎస్ నాయకుల నిరసన



బాల్కొండ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మోర్తాడ్, జనవరి 15: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకూ వెంటాడుతూనే ఉంటామని, ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని బీఆర్‌ఎస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. నందిపేట్‌లో పోలీసులు అరెస్టు చేసిన ఇద్దరు బీఆర్‌ఎస్ నాయకులను బాల్కొండ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. దీంతో రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు బాల్కొండ పోలీస్‌స్టేషన్ ఎదుట బుధవారం రాత్రి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయమని అడిగితే అక్రమంగా అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. ఏడాదికి ఒక్కో గ్రామానికి పది ఇండ్లు కట్టిస్తానని హామీ ఇచ్చావని, ఒక్క ఇల్లు కూడా కట్టించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని అన్నారు. ఇద్దరిని అరెస్టు చేసిన విషయం తెలుసుకొని, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి వారిని విడిపించారని తెలిపారు. ఎమ్మెల్యేకు ధైర్యం ఉంటే.. మాటల్లో ఫైర్ ఉంటే ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని సవాల్ విసిరారు. పోలీస్‌స్టేషన్‌లోనే బీఆర్‌ఎస్ కార్యకర్తలపై బీజేపీ నాయకులు దాడిచేశారని, ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. గురువారం ఇన్‌చార్జి సీపీని కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

## రైతుల సుదీర్ఘ పోరాటం, ఎంపీ కవిత కృషితో
# పసుపు బోర్డు ఏర్పాటు

- బోర్డు ఏర్పాటు అభినందనీయం
- కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.15వేలు ఉండేలా చూడాలి
- పసుపు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలి
- జిల్లా పసుపు రైతులకు శుభాకాంక్షలు
- మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



మోర్తాడ్, జనవరి 15: రైతుల సుదీర్ఘ పోరాటం, అప్పటి నిజామాబాద్ ఎంపీ కవిత కృషితో జిల్లా ప్రజల చిరకాల వాంఛ పసుపు బోర్డు ఏర్పాటు కల నెరవేరిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ కేంద్రంగా జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు అయినందుకు పసుపు రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. పసుపుబోర్డు ఏర్పాటు కోసం రైతులు సుదీర్ఘ పోరాటం చేశారని, ఆనాటి ఎంపీ కవితమ్మ నాయకత్వంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అందరూ అనేక సార్లు సంబంధిత కేంద్ర మంత్రులు, ప్రధాన మంత్రిని కలిశారని గుర్తుచేశారు. పసుపుబోర్డు ఏర్పాటు కోసం కవిత పార్లమెంట్‌లో గళమెత్తడం లాంటి పోరాటాల ఫలితంగా పసుపుబోర్డు ఏర్పాటు కల ఫలించిందని పేర్కొన్నారు. పసుపుబోర్డు ఏర్పాటు కోసం పసుపు పండించే రాష్ట్రాల సీఎంలతో మాట్లాడి ఎమ్మెల్యేలతో కలిసి కేంద్రానికి లేఖలు ఇప్పించడం కోసం కవిత చేసిన కృషిని ఎమ్మెల్యే వేముల గుర్తుచేశారు. ఇప్పటికైనా పసుపు కనీసమద్దతు ధర క్వింటాలుకు రూ.15వేలు ఉండేలా చూడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచిస్తున్నామని పేర్కొన్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని వేల్పూర్‌లో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే 42 ఎకరాల్లో టర్మరిక్ స్పైస్‌పార్క్ ఏర్పాటు చేసి రోడ్లు, కంపౌండ్ వాల్ పనులు పూర్తిచేశారని తెలిపారు. ప్రస్తుతం నిజామాబాద్ కేంద్రంగా జాతీయ పసుపు బోర్డు ఏర్పాటైన సందర్భంగా వేల్పూర్‌లో పసుపు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు లభించేలా, పసుపునకు డిమాండ్ పెరిగేలా చూసే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు. పసుపు బోర్డు నూతన చైర్మన్‌గా నియాయకమైన పల్లె గంగారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

## పసుపు బోర్డు ప్రారంభం



పసుపు బోర్డు ప్రారంభోత్సవంలో పాల్గొన్న రైతులు, రైతు నాయకులు

ఖలీల్‌వాడి, జనవరి 15: నిజామాబాద్ కేంద్రంగా పసుపు బోర్డును కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌తో కలిసి ఢిల్లీ నుంచి మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో పండే పసుపునకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. బోర్డు ఏర్పాటుతో పరిశోధనలు పెరుగుతాయని, అభివృద్ధి మరింత పుంజుకుంటుందని తెలిపారు. బోర్డు చైర్మన్‌గా ఎంపికైన పల్లె గంగారెడ్డిపై ఎంతో బాధ్యత ఉన్నదని తెలిపారు. కార్యక్రమంలో పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రాకేశ్‌రెడ్డి, భారత స్పైసెస్ బోర్డు కార్యదర్శి హేమలత, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సంయుక్త కార్యదర్శి కేసంగ్ యంగ్ జోంషేర్పి, స్పైసెస్ బోర్డు డైరెక్టర్ రేమశ్రీ, రైతులు పాల్గొన్నారు.

## సంక్రాంతి సంబురాల్లో ఎమ్మెల్సీ



ఉమ్మడి నిజామాబాద్ ఎమ్మెల్సీ కవిత హైదరాబాద్‌లోని తన నివాసంలో మంగళవారం సంక్రాంతి సంబురాలు జరుపుకున్నారు. ముగ్గులు వేసి రంగులు అద్దారు. కుటుంబ సభ్యులతో కలిసి పాలు పొంగించారు. రాష్ట్ర ప్రజలు, రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

–ఖలీల్‌వాడి, జనవరి 15



భిక్కంద మండలం పెద్ద తక్కడ్‌పల్లి గ్రామంలో పంట చేనులో పూజలు చేస్తున్న రైతు కుటుంబం

మకర సంక్రాంతి, కనుమ పండుగలను ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రజలు మంగళ, బుధవారాల్లో ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు ముంగిళ్లలో అందమైన ముగ్గులు వేసి పాలు పొంగించారు. యువకులు, చిన్నారులు గాలిపటాలను ఎగురవేయడంలో పోటీ పడ్డారు. రైతులు పంట పొలాల్లో గుడిలాగా ఏర్పాటు చేసుకొని పాండవులకు పూజలు చేశారు. అక్కడే వంటలు చేసుకొని ఆరగించారు.

–నమస్తే తెలంగాణ యంత్రాంగం, జనవరి 15